క్లుప్తంగా

త్వరలో చిత్ర నిర్మాణం

నయీంనగర్ : వరంగల్ నేపథ్యంలో తెలంగాణ మాండలికంలో వరంగల్ పరిసరాల్లో త్వరలో చిత్ర నిర్మాణం చేయనున్నట్లు కార్తోస్ మీడియా ప్రతినిధి సందీప్ తెలిపారు. సిని మా అవకాశాల కోసం ఎదురుచూస్తున్న వరంగల్ నటీనటులకు ఇందులో అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మనోజ్, సుశాంత్, రమేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస పూజలు

కాశిబుగ్గ : వరంగల్ కాశిబుగ్గలోని చారిత్రక శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో శ్రావణమాసం ఆఖరి రోజు మాసశివరాత్రి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం,అభిషేకాలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం ఆలయంలోని సహస్ర లింగానికి అన్నపూజ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పూజలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో భవిష్యత్

హన్మకొండ అర్బన్ : ఎన్‌సీసీ శిక్షణతో కేడెట్లకు మంచి భవిష్యత్ ఉంటుందని పింగిళి కళాశాల ప్రిన్సిపాల్ బత్తిని చంద్రమౌళి అన్నారు. ఇటీవల జరిగిన ఎన్‌సీసీ ఎంపికలో కళాశాల నుంచి ఎంపికైన 52 మంది విద్యార్థులను ఆయన అభినందించారు. చంద్రమౌళి మాట్లాడుతూ ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షతో పాటు నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ రాజేష్ కౌశిక్‌ను ప్రిన్సిపాల్ చంద్రమౌళి, అధ్యాపక బృందం అభినందించారు. కేర్ టేకర్ డాక్టర్ కల్పన, ఆర్మీ పరేడ్ ఇన్‌స్ట్రక్టర్ హవల్దార్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం


చందు

హసన్‌పర్తి: నగరంలోని భీమారానికి చెందిన బీటెక్ విద్యార్థి అదృశ్యమయ్యాడని బాధితుడి కుటుంబ సభ్యులు కేయూ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. భీమారానికి చెందిన జనగాని చందు హుజూరాబాద్ సింగపూర్‌లోని కిట్స్‌లో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 7న దుర్గామాత వద్దకు వెళ్లి వస్తానని బయల్దేరాడు. సాయంత్రం వరకు కూడా తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు మిత్రులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. విద్యార్థి తండ్రి ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డిగ్రీ కీలకమైన దశ

విద్యారణ్యపురి: ప్రతి విద్యార్థికి జీవితంలో డిగ్రీ స్థాయి విద్య కీలకమైన దశగా భావించాలని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. బుధవారం ఆ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందిన బీకాం, బీబీఏ విద్యార్థులతో నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచలో కష్టపడి చదివితేనే భవిష్యత్‌లో ఉన్నత స్థితిలోనికి వస్తారని తెలిపారు. సమావేశంలో వాణిజ్యవిభాగం అధిపతి డాక్టర్ వినోద్‌రావు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాను విజయవంతం చేయాలి

మామునూరు: వరంగల్ దేశాయిపేటరోడ్డులోని ఒయాసిస్ పబ్లిక్ హైస్కూల్‌లో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 17న నిర్వహించే మెగా జాబ్‌మేళాను విజయవంతం చేయాలని ట్రస్ట్ చైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు కోరారు. బుధవారం వరంగల్ రంగశాయిపేటలోని కాంక్ష ఫంక్షన్‌హాల్‌లో రిషినంద్ ట్రస్ట్ మెమోరియల్ చైర్మన్ కొల్లూరు యోగానంద్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన హాజరై మేళా వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో విష్ణు, కుమార్, ఈశ్వర్, బాబురావు, రంజిత్, కార్తీక్, తాళ్లపల్లి అర్జున్, చాపల నాగరాజు, తిరుపతి రెడ్డి, మజ్జిగ జగన్, మిర్యాల రాము, సత్యం గౌడ్, లక్కాకుల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల జాక్, తెలంగాణ స్టేట్ కాంట్రాక్టు టీచర్స్ రాష్ట్ర జాక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆందోళన బాట పట్టారు. బుధవారం యూనివర్సిటీలోని వివిధ విభాగాల వద్ద బయోటెక్నాలజీ, విద్యాకళాశాల, జువాలజీ తదితర విభాగాల వద్ద , హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రెండు సంఘాల జాక్ బాధ్యులు, కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు. కార్యక్రమంలో కేయూ జాక్ చైర్మన్ డాక్టర్ పి కరుణాకర్, ఆజాక్ బాధ్యులు డాక్టర్ చిర్రరాజు, సూర్యనారాయణ, సాంబశివరావు, ఫిరోజ్, సతీష్, రాధికా, సునీత, ప్రణీత, దేవేందర్, రమేష్, జితేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

మడికొండ: మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మాస శివరాత్రి పురస్కరించుకొని బుధవారం మహాన్యాస పూర్వక ఏకదశి రుద్రాభిషేకం నిర్వహించారు. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి, రుద్రహోమం, నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఊరంతా పోచమ్మ బోనాలు

- తెలంగాణలోనే న్యూశాయంపేటలో నిర్వహించడం ప్రత్యేకం
- ఆనవాయితీగా కొనసాగుతున్న వైనం



కాజీపేట అర్బన్ : మండలంలోని 31వ డివిజన్‌లోని న్యూశాయంపేటలో ఒకే రోజు పోచమ్మ బోనాల పండుగను గ్రామస్తులు నిర్వహించడం రాష్ట్రంలోనే ప్రత్యేకం. అది కూడా గురువారం నిర్వహించడం అనవాయితీగా కొనసాగుతోంది. సాధారణంగా తెలంగాణలో బోనాల పండుగను ఆషాడం, శ్రావణ మాసాల్లో బుధ, శుక్ర, ఆదివారాల్లో, కులాల వారీగా నిర్వహిస్తారు. కానీ న్యూశాయంపేటలో మాత్రం శ్రావణమాసంలో గురువారం ఊరంతా ఒక్కటిగా నిర్వహిస్తారు.

కుమ్మరులే పూజారులుగా బోనాలు....

న్యూశాయంపేటలో పోచమ్మ బోనాలను శాలివాహనులు నిర్వహిస్తారు. బోనాల రోజు దేవత పూనీన మహిళలు ఊరు తిరిగే క్రమంలో నాలుగు బాటల వద్ద పోచమ్మతల్లి కాళ్లకు నీరు పోసి యాటల మొక్కు చెల్లిస్తారు. గ్రామంలోని ప్రతి కూడలిలో ఇదే తంతుతో వైభవంగా జరుపుకుంటారు.

యాదవుల మేకపోతు బండి ప్రత్యేక ఆకర్షణ..

బోనాల పండుగ రోజు యాదవులు ఏర్పాటు చేసే మేకపోతుల బండి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఆడపడుచుల బోనాలతో యాదవులు ఉల్లాసంగా ఇంటి నుండి నృత్యాలు చేస్తూ బయలుదేరుతారు.

బోనాలను ఘనంగా నిర్వహిస్తాం



న్యూశాయంపేటలో గు రువారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహిస్తాం. ఇందుకు ఏర్పాట్లు చేశాం. పండుగకు గ్రామంలోని ప్రతి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు తరలివస్తారు.

– మామిండ్ల రాజు, కార్పొరేటర్

మా కుటుంబానికే గౌరవం



గ్రామంలో ఊరంతా ఒ క్క రోజే నిర్వహించే పోచమ్మ బోనాలను నిర్వహించే అరుదైన అవకాశం మా కుటుంబానికే దక్కడం ఊరు మా కుటుంబానికి ఇచ్చిన గౌరవంగా భావిస్తాం. పూర్వ కాలం నుంచి నేటి వరకు మా కుటుంబమే కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.

– వేల్పుల మోహన్‌రావు

ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన

వరంగల్: దేశాయిపేటలోని సీకేఎం కాలేజీలోని విద్యార్థులకు బుధవారం ఓటరు నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్ మాట్లాడుతూ మన భారత దేశ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది ఒక ఆయుధం లాంటిదని దానిని మన భవిష్యత్ ఉజ్వలంగా రక్షణగా ఉండటానికి 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయుని మీద ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్ రావు, శ్రీనివాసరావు, డాక్టర్ మోహన్, కెప్టెన్ డాక్టర్ పిసతీష్‌కుమార్, గోపి, సునీత, పూర్ణచందర్, జీకే కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఖిలావరంగల్: అర్హులైన వారు ఈనెల 19లోపు ఓటరుగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం వరంగల్ శివనగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో తెలుగుతల్లి పట్టణ


ఖిలావరంగల్ : మాట్లాడుతున్న తహసీల్దార్

సమాఖ్య ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై మహిళా సంఘాల సభ్యులు, ఓబీ మెంబెర్స్, ఆర్పీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించి ఓటు నమోదు అవశ్యకతపై చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో ట్రైన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రాజేష్‌కుమార్, టీఎంసీ రమేష్, సీఓ సుజాత, టీఎల్ఎఫ్, ఓబీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం



హన్మకొండ అర్బన్ : వినాయక చవితి, దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో మట్టి విగ్రహాలనే ప్రతిష్ఠించి పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. మేదిని సాంఘిక సేవా సంస్థ రూపొందించిన 'ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దు–మట్టి విగ్రహాలు ముద్దు' కరపత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, మేదిని సాంఘిక సేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి కొలిపాక ప్రకాష్, అనంత్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కార్మికులు సంఘటితమై ఉద్యమించాలి

ఖిలా వరంగల్: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి పాలన సాగిస్తున్నాయని, కార్మికులు సంఘటితమై హక్కుల కోసం ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం సూచించారు. బుధవారం పడమరకోటలో ముదిరాజ్ ఫంక్షన్‌హాల్‌లో రాజు అధ్యక్షతన భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) వరంగల్ జిల్లా నిర్మాణ జనరల్‌బాడీ సమావేశం జరిగింది. ఆయన హాజరై మాట్లాడుతూ కార్మికులకు ఉద్యోగ, ఉపాధి భద్రత కల్పించడలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. అంతకు ముందు వరంగల్, హన్మకొండ జిల్లాల కమిటీని ఎన్నుకున్నారు

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

హసన్‌పర్తి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ ఆరోపించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అంగన్‌వాడీ ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి సంఘీభావం ప్రకటించారు. సమ్మెలో భాగంగా ఈనెల 14న సీడీపీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యకమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సారంగపాణి, అంగన్‌వాడీ టీచర్లు కిరీట, కె.ఉమారాణి, స్వరూప పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి

కాశిబుగ్గ : ఈనెల 18 నుంచి 22 వరకు జరగబోయే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఎంఎస్పీ వరంగల్ తూర్పు ఇన్‌చార్జ్ ఈర్ల కుమార్ ఆధ్వర్యంలో కాశిబుగ్గ జంక్షన్‌లో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్ష ప్రారంభించిన దండోరా నాయకులు పోలెపాక యాదగిరి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజులలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిందని 10 ఏళ్లు కావస్తున్నా ఇంతవరకు ఆ హామీని నెరవేర్చలేదన్నారు. దీక్షకు సామాజికవేత్త పెరుమాండ్ల లక్ష్మణ్ సంఘీభావం తెలిపారు. దీక్షలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను మధుకర్, క్రిష్ణవేణి, గిరి, రాజు, ఆరుణ్‌కుమార్, రాజ్‌కుమార్, వినయ్ పాల్గొన్నారు.

బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

వరంగల్: సెప్టెంబర్ 18 నుంచి జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో బీసీలకు రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపచేయాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దేశ జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీలకు రిజర్వేషన్ లేనందున పార్లమెంట్‌లో, రాష్ట్రాల శాసనసభల్లో ప్రాతినిథ్యం నామమాత్రంగానే ఉందన్నారు. ఫలితంగా బీసీల సంక్షేమం, అభివృద్ధి గురించి పట్టించుకునే అవకాశమే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

ఖిలా వరంగల్: వరంగల్ పడమరకోటకు చెందిన మున్సిపల్ అవుట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికుడు మైదం జనార్దన్(50) బుధవారం గుండెపోటుతో మరణించగా స్థానిక కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ, కార్మిక నేత బోగి సురేష్ మృతుడి భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కార్పొరేటర్ బాధిత కుటుంబ సభ్యులకు దహన సంస్కారాల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందిస్తూ కుటుంబ సభ్యుల్లో ఒకరికి పని కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

ఆటోనగర్ మెకానిక్ అసోసియేషన్ కమిటీ

వరంగల్: వరంగల్ కాకతీయ ఆటోనగర్‌లోని ఎంసీఈఓ, ఎల్‌సీవీ, డీసీఎంల మెకానిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా జి.ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా ఎండి.బాబా, కోశాధికారిగా కె.అనిల్, ఉపాధ్యక్షులుగా డీ.కుమార్, శైలేష్‌ప్రసాద్, సలహాదారులుగా గడదాసు శివప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజర్లుగా అంజయ్య, పూర్ణచందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి సభ్యులు ఎన్నికయ్యారు.

దడవాయి యూనియన్ నూతన కమిటీ

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని దడవాయి యూనియన్‌కు జరిగిన ఎన్నికల్లో నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఈటల దేవేందర్, ప్రధాన కార్యదర్శిగా సోల రవి, ఉపాధ్యక్షులుగా బోనాల వీరన్న, కోశాధికారిగా రంగు రవీందర్, సంయుక్త కార్యదర్శిగా తూర్పాటి రాంకిషన్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల కన్వీనర్ నిమ్మాని నాంపెల్లి తెలిపారు.

పౌష్టికాహార మాసోత్సవం

వరంగల్ : వరంగల్ ప్రాజెక్ట్ పైడిపల్లి సెక్టార్ పరిధిలోని 14వ డివిజన్ సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన, ఐసీడీఎస్ సీడీపీఓ విశ్వజలు హాజరై మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు రక్తహీనత గురించి, అదేవిధంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారం గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జక్కుల లావణ్య, పోషణ అభియాన్ కార్తీక్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ల ఆవిష్కరణ

కాజీపేట: నగరంలోని 61వ డివిజన్ సిద్దార్థనగర్ ప్రభుత్వ కమ్యూనిటీ హాల్‌లో బుధవారం రాత్రి సఖీ కేంద్రం సభ్యులు ఉచిత టోల్‌ఫ్రీ నంబర్ 181 సేవలపై ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సఖీ కేంద్రం, జిల్లా ఐసీడీఎస్ శాఖలు సంయుక్తంగా బాలికలు, యువతులు, మహిళల వేధింపులపై చేపడుతున్న సహాయ కార్యక్రమాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అవగాహన కల్పించారు. ఎ.శ్రీదేవి, వి.వినిలా, వన జ పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో రాణించాలి

కాశిబుగ్గ : మలేషియా కౌలాలంపూర్‌లో జరిగే 35వ ఆంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్–2023 పోటీల్లో రాణించి దేశానికి, నగరానికి పేరు తేవాలని కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ కోరారు. బుధవారం అయన అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికై మలేషియా వెళ్తున్న క్రీడాకారుడు ఎల్ఐసీ వరంగల్–1 ఉద్యోగి బలభక్తుల శ్రీహరిని సన్మానించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ఈనెల 16, 17వ తేదీల్లో మలేషియాలో జరిగే పోటీలో రాణించి తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌జీఓ ప్రధాన కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు యాసిన్, ముల్కి రాజు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

హసన్‌పర్తి: పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన నిర్వహించారు. బుధవారం భీమారం సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జక్కుల భాను మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి పదేళ్లు గడుస్తున్నప్పటికీ విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఏఐఎస్ఎఫ్ఐ నాయకులు ఇమ్మడి అఖిల్, నరేష్, రాకేష్, ప్రవీణ్, ముత్యం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె విరమణ



ఎంజీఎం : ఆగస్టు 31 నుంచి బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెను విరమిస్తున్నట్లు హనుమకొండ అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేశ్ కన్నా మాట్లాడుతూ మంగళవారం డీహెచ్ కార్యాలయంలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ సిబ్బందితో జరిగిన చర్చల్లో సమస్యలు పరిష్కారిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు. హామీని అమలు చేయకుంటే భవిష్యత్‌లో మళ్లీ నిరవధిక సమ్మెలోకి వెళ్తామని పేర్కొన్నా రు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మడికొండ: గ్రేటర్ నగరంలోని 64వ డివిజన్ మడికొండ అంబేడ్కర్ కాలనీలో సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణానికి కార్పొరేటర్ ఆవాల రాధికరెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు ఎడబోయిన ప్రభాకర్, వెన్నమల్ల రమేష్, కాలేశ్వరపు రాజేందర్, బండారి మహేందర్, జవ్వాజీ కిషన్, భూపాల్‌కర్ణ, కట్ట నగేష్, దార సూరి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించింది కాంగ్రెస్సే

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి


ఎమ్మార్పీఎస్ దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

హన్మకొండ: రాజీవ్‌గాంధీ విద్యామిషన్, సర్వశిక్ష అభియాన్‌లో ఉద్యోగావకాశాలు కాంగ్రెస్ హయాంలోనే కల్పించిందని టీపీసీసీ చీఫ్ అధ్యక్షుడు అనుముల రేవంత్ రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న దీక్షలకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడానికి మిమ్ములను నియమించారన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మీ ఉద్యోగాలు పర్మనెంట్ కాకపోవడం బాధకరమన్నారు. విద్యను ప్రైవేటీకరణ చేసి సీఎం కేసీఆర్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే న్యాయమైన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పక్కనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ చేస్తున్న దీక్ష శిబిరం వద్దకు చేరుకుని సంఘీభావం తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రాహుల్‌గాంధీ. ఖర్గేతో ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా లేఖలు ఇప్పించాలని కోరగా రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.

మైనార్టీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలి


సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

న్యూశాయంపేట : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పది ఉమ్మడి జిల్లాల్లో మైనార్టీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సయ్యద్ ఉమర్ జలీల్‌కు టీఎస్–మైనారిటీ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్, మైనారిటీ రైట్స్ ప్రొటెక్షన్ ఫ్రంట్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ సెక్రటేరియట్‌లో వినతిపత్రం అందజేశారు. దీంతో పాటు వరంగల్ జిల్లాలోని జక్కలొద్దిలో ట్రిమిస్ రిసోర్స్ సెంటర్, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న 16 గురుకులాలకు శాశ్వత భవనాలు, బాల బాలికలు ఒక్కొక్కటి చొప్పున గురుకుల డిగ్రీ కళాశాలలు, కమ్యూనిటీ మొబైలైజింగ్ ఆఫీసర్ల నియామకం, బీసీ–ఈ సర్టిఫికెట్స్ జారీలో ఇబ్బందులు, ఉద్యోగులకు రోస్టర్ పాయింట్స్ తదితర అంశాలను సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లినట్లు మైనారిటీ రైట్స్ ప్రొటెక్షన్ ఫ్రంట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌మహ్మద్ తెలిపారు. సెక్రటరీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో టీఎస్–మేసా రాష్ట్ర అధ్యక్షుడు ఫారూఖ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి తోఫికుర్–రహమాన్ ఉన్నారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలి


దీక్షల్లో కూర్చున్న విద్యుత్ ఉద్యోగులు

హన్మకొండ : విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై టీఎస్ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 15న చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చినట్లు టీఎస్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం గౌరవాధ్యక్షుడు జి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయం ఎదుట టీఎస్ యూఈ ఈయూ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు బుధవారం రెండో రోజు నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలనుద్దేశించి జి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ సంస్థ అభివృద్ధికి క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్న ఉద్యోగులపై యాజమాన్యం వివక్ష చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీక్షల్లో టీఎస్ యూఈఈయూ డిస్కం జాయింట్ సెక్రటరీ ఎల్.శ్రీనివాస్, ఉద్యోగులు బూర వరుణ్‌రాజ్, తిరునహరి రంగనాథస్వామి, ఎండీ.రఫీ, సీహెచ్.సులోచన, పాల్గొన్నారు.

చల్లని తల్లికి బోనమెత్తిన మహిళలు


కాజీపేట : బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

కాజీపేట: పట్టణంలోని పలు కాలనీల్లో చల్లని తల్లి పోచమ్మ బోనాల ఉత్సవాలను బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లలో బోనాలు చేసుకుని పిల్లాపాపలతో కలిసి ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని అమ్మవారికి నైవేద్యాలు, కల్లు శాకలు సమర్పించుకున్నారు. ఉత్సవాల్లో కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, ఎలకంటి రాములు, బీఆర్ఎస్ నాయకులు పి.శివకుమార్, తేలు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు. 62వ డివిజన్ సోమిడి శివారులో పోచమ్మను బుధవారం డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పోచమ్మకు నూతన వస్త్రాలను సమర్పించారు. మాజీ కార్పొరేటర్ రమ, కోటేశ్వర్, బోయిని కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

మడికొండ: గ్రేటర్ పరిధిలోని మడికొండలో శ్రావణమాసం చివరి బుధవారం కావడంతో గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46, 64 డివిజన్లలోని మడికొండ, రాంపూర్, ఉనికిచర్ల, టేకులగూడెం గ్రామాల్లో పోచమ్మ బోనాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మునిగాల సరోజన, ఆవాల రాధికరెడ్డి, నాయకులు గాండ్ల భిక్షపతి, వినోద్, అనిల్, ఉపేందర్, పాల్గొన్నారు.

చింతల్‌లో బోనాల పండుగ

న్యూశాయంపేట : వరంగల్ నగరంలోని 36వ డివిజన్ చింతల్ జ్యోతిబసు నగర్‌లో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మైసమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మేకపోతును బలిచ్చి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గడల రమేశ్, భక్తులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


'ఆయుష్మాన్‌భవ'పై అవగాహన కల్పించాలి


దేశాయిపేట : కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే

దేశాయిపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆయుష్మాన్‌భవ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే సూచించారు. బుధవారం ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని వర్చువల్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించగా.. వరంగల్ దేశాయిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈపథకంలో భాగంగా ప్రజలకు దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స చేస్తారని తెలిపారు. స్వచ్ఛభారత్‌ను అన్ని ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించాలని కోరారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆయుష్మాన్‌భవ కార్డులు తీసుకోవాలని, ఈ కార్డులు ఉన్నవారు ఎక్కడైనా ఉచిత వైద్యం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ, డీఆర్డీఓ సంపత్‌రావు, డీడబ్ల్యూఓ శారద, అడిషనల్ డీఎంహెచ్‌ఓ సుధార్‌సింగ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ గోపాల్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాష్, డాక్టర్ మధుసూదన్, భరత్ కుమార్, అనిల్‌కుమార్, డీపీఓ అర్చన, ప్రసాద్, కొర్నేల్, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


హన్మకొండ అర్బన్ : జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేసి ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి గణేష్, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాస్‌కుమార్ అన్నారు. బుధవారం రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభమైన ఆయుష్మాన్ భవ కార్యక్రమానికి అధికారులు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో హాజరైయ్యారు. ప్రధాని పుట్టిన రోజైన సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.మదన్‌మోహన్‌రావు, జిల్లా వెల్ఫేర్ అధికారి మధురిమ, ఆయుష్ ఆర్‌డీడీ రవినాయక్, బీసీ వెల్ఫేర్ డీడీ రామ్‌రెడ్డి, జీఎం ఇండస్ట్రీస్ హరిప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యాకూబ్ పాషా, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గణపతి బ్రహ్మోత్సవాలు


ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ రవీందర్

కాజీపేట : పట్టణంలోని విష్ణుపురిలో కొలువుదీరిన స్వయంభూ శ్రీశ్వేతార్కమూలగణపతి దివ్యక్షేత్రంలో బుధవారం గణపతి బ్రహ్మోత్సవం భక్తుల కోలాహలం మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పంచామృతాలు, గంగోదకంతో ఆయన్ను శుద్ధి, సంప్రోక్షణ చేశారు. 16 రోజుల పాటు సాగే ఉత్సవాలను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సాయంత్రం శ్రీలలితావిష్ణుసహస్ర నామపారాయణం, మూలమంత్రసహిత గణపతి ఉపనిషత్ పారాయణాలు నిర్వహించారు. శ్వేతార్కుడిని రాజగణపతిగా పట్టువస్త్రాలతో అలంకరించారు. ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ దంపతులు కలశస్థాపనతో పాటు ఉభయుల సేవలో భాగస్వామ్యం పంచుకున్నారు. భక్తులకు అన్నపూర్ణ కేంద్రంలో నిత్యాన్నదానం చేశారు.

నేత్ర, శరీరదానంపై అవగాహన



వరంగల్ చౌరస్తా : జాతీయ నేత్ర దాన దినోత్సవం సందర్భంగా రామన్నపేట పడిశాల వీరభద్రయ్య మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థినులకు నేత్ర దానం, శరీర దానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి మాట్లాడుతూ నేత్రదానం మహాదానం, మరణానంతరం నేత్రదానం చేస్తే ఇద్దరి అంధులకు చూపునిస్తుందన్నారు. దేశంలో కోటి మంది అంధులు ఉంటే, అందులో 20 లక్షల మంది కార్నియా అంధులున్నారని పేర్కొన్నారు. అసోసియేషన్ సలహాదారుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. నేత్రదానం పై ప్రతిజ్ఞ చేయించారు. కాలేజీ యాజమాన్యం శీతల్, అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి పాల్గొన్నారు.